ప్రజాశక్తి

శుక్రవారం 11 జులై 2025 | 5 | అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

కరువు నివారణకు శాశ్వత పరిష్కారం

కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాయలసీమ జిల్లాలలో కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కనుగొందామని కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లో మినీ కాన్ఫరెన్స్ హాల్లో దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ లోని కరువు పీడిత జిల్లాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, రాష్ట్ర హార్టికల్చర్ మరియు సిరికల్చర్ కమిషనర్ కె .శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూల్ జాయింట్ కలెక్టర్ నవ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దక్షిణ ఆంధ్రలోని జిల్లాలలో కరువును శాశ్వతంగా పరిష్కరించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కలిసికట్టుగా కూర్చుని ఆలోచించి కరువు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి, ఉపాధి హామీ పథకం, వాటర్ షెడ్, తదితర పథకాల క్రింద ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో తెలపాలని ఎలాంటి సహకారం కావాలన్నా కేంద్రం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పథకాలు అమలతో పాటు కరువును ఎలా అధిగమించవచ్చునో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఎలాంటి సహాయం అందించాలి భవిష్యత్తులో ఏమి చేయాలి అనే అంశాలను వచ్చే పదేళ్లకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే దానిపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. అధికారులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉద్యానవన శాఖ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్ర ఉద్యానవన శాఖ సిరికల్చర్ కమిషనర్లు ఢిల్లీ రావు, కె. శ్రీనివాసులు మాట్లాడుతూ, రాయలసీమ జిల్లాలలో నెలకొన్న కరువు పరిస్థితి వివిధ పంటల సాగు వివరాలు నీటిపారుదల అంశాలు గురించి ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. బుందేల్‌ఖండ్ ప్రాంతం మాదిరిగా రాయలసీమ జిల్లాలకు కూడా ఆర్థిక సహాయం ప్రకటించాలని సీమ అభివృద్ధికి అవసరమైన సహకారం కేంద్రం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాయలసీమ జిల్లాల వ్యవసాయ ఉద్యాన అనుబంధ శాఖ అధికారులు శాస్త్రవేత్తలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సత్యసాయి సమాధిని దర్శించుకున్న కేంద్ర మంత్రి :

మానవాళికి సత్యసాయి అందించిన సేవలు వెలకట్టలేని కేంద్ర గ్రామీణ అభివృద్ధి వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పేర్కొన్నారు. గురువారం ప్రశాంతి నిలయంలో నిర్వహించిన గురుపౌర్ణిమ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర ఎంతో ఉందన్నారు. సత్య సాయి కూడా గురువు లాంటి వారేనని ఆయన అందించిన మానవతా విలువలతో కూడిన బోధనలు మానవాళికి ఎంతో అవసరం అని అన్నారు. బాబా సేవలను ట్రస్టు సభ్యులు కొనసాగించడం పట్ల ఆయన ప్రశంసించారు. ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ పుట్టపర్తికి వచ్చి బాబా సమాధిని దర్శించుకున్న తర్వాత మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సత్యసాయి అందిస్తున్న విద్యా సంస్థలు మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రపంచంలోనే పేరుగాంచాయన్నారు. అలాగే లక్షల రూపాయల ఖరీదు చేసే వైద్యాన్ని ఇక్కడ సత్యసాయి వైద్య సేవలు ఉచితంగా అందించడం గొప్ప వరం అన్నారు. గురువులను స్మరించుకుంటూ గురు పౌర్ణమి వేడుకలు బాబా సమాధి చెంత జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

కేంద్ర మంత్రితో పలు అంశాలపై చర్చించిన చంద్రబాబు

గురు పౌర్ణమి వేడుకలు సందర్భంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తో పాటు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రిని శాలువాలతో సన్మానించి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మామిడి ఇతర పంటలకు సంబంధించిన సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. వ్యవసాయాన్ని రైతులను ఆదుకునేందుకు కేంద్రం తగు సహాయం అందించాలని కోరారు. స్పందించిన కేంద్ర మంత్రి కేంద్ర సహకారం ఎప్పుడూ ఉంటుందనితగిన కార్యకరణతో నివేదికను పంపితే తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రికి వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సిఎం చంద్రబాబు

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, తదితరులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు)

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి, కొత్తచెరువు

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మెగా పేరెంట్స్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సత్యసాయి విమానాశ్రయానికి గురువారం ఉదయం 9:30 కు చేరుకోగా. ఆయనకు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీతో పాటు జిల్లా కలెక్టర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన కొత్తచెరువులోని సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆయనతోపాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు చేరుకున్నారు. రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో పలు విషయాలను చర్చించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యాభివృద్ధి, ప్రవర్తన, హాజరు, ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. బాగా చదువుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన పదో తరగతి ఏ సెక్షన్ కు చెందిన పి.రిహాన్ బాష, పి.జిగ్ను ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. వారి మార్కులను అడిగి తెలుసుకున్నారు. 8వ తరగతి బి సెక్షన్‌కు చేరుకొని అక్కడ విద్యార్థులతో ఉపాధ్యాయుడిగా మారి వనరులు అనే పాఠాన్ని బోధించారు. విద్యార్థులతోపాటు విద్యాశాఖ మంత్రి కూడా కూర్చొని ఆయన చెప్పే పాఠాన్ని విన్నారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ పాఠశాల, కళాశాలను చూస్తుంటే ఆధునిక దేవాలయాలు గుర్తుకొస్తున్నాయన్నారు. ఈ పాఠశాల కళాశాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండవసారి ఈ మెగా పేరెంట్స్ మీటింగును 2 కోట్ల 28లక్షల మందితో 61130 పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకురావడం విద్యను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి పేదవాడు చదువుకొని ఉన్నతమైన స్థానానికి రావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్న తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మందికి రూ. 8700 కోట్ల రూపాయలని అందజేయడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ పథకం కింద బ్యాగులను పుస్తకాలకు దుస్తులను అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని ఉద్దేశంతో చిన్న బియ్యాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యవేక్షించాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లి ప్రపంచ దేశాల్లో తెలుగువారి యొక్క కీర్తిని వ్యాపింపజేయాలన్నారు. మెగా డీఎస్సీని కూడా నిర్వహించామని ఎలాంటి అక్రమాలు లేకుండా బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించామని చెప్పారు. ఇక్కడ అర్ధాంతరంగా ఆగిన ఇండోర్ స్టేడియానికి రెండు కోట్ల రూపాయలను తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మీయ సమావేశంలో మాట్లాడిన వ విద్యార్థులు తల్లిదండ్రులను అభినందించి సన్మానం చేశారు. రాజకీయ నాయకుల కంటే విద్యార్థులు బాగా ప్రసంగించారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మాట్లాడుతూ తను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేస్తున్నానన్నారు విద్యార్థులు ఏ స్థాయికి ఎదిగినా పాఠశాలను గురువులను గ్రామాన్ని మర్చిపోకూడదన్నారు. తల్లి పట్ల ప్రతి ఒక విద్యార్థి వినయ విధేయతలు కలిగి ఉండాలని చెప్పారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బికె. పార్థసారథి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ శివరామరాజు, జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, డీఈవో కిష్టప్ప, ఎంఇఒ జయచంద్ర, పాఠశాల హెచ్‌ఎం గోపాల్ , తదితరులు పాల్గొన్నారు.

స్థల దాతను సన్మానించిన ముఖ్యమంత్రి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రిటైర్డ్ ప్రిన్సిపల్ రామప్ప గతంలో స్థలాన్ని కొని ఇచ్చారు. దీనితో సత్యసాయి ట్రస్ట్ వారు ప్రభుత్వ కళాశాలను నిర్మించారు. ఎంతోమంది పేద విద్యార్థులు ఇక్కడ చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగారు. ఈ నేపథ్యంలో మెగా పేరెంట్స్ సమావేశానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్థలాన్ని ఇచ్చిన దాత కూతురు పివీ పార్వతమ్మ పి.వి సూర్యనారాయణను సత్కరించి అభినందనలు ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలోనూ దాతలు ముందుకు వచ్చి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. అనంతరం వారి యొక్క యోగ క్షేమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అలాగే సన్మాన దాతల కుమారుడు పి వి రాజుదేవ్ రూ. 5 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు.

సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న సిఎం

జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. గురువారం కొత్తచెరువు పర్యటన ముగించుకుని నేరుగా ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, ఎంపీ బి. కె పార్థసారథి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, ట్రస్టు సభ్యులు స్వాగతం పలికారు. బాబా ఆశయాలను ట్రస్టు సేవలను కొనసాగించడం పట్ల అభినందనలు తెలిపారు. సత్యసాయి శతాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్న సంక్షేమ ప్రాజెక్టులు ఆరోగ్యము విద్య గ్రామీణ అభివృద్ధిలో ట్రస్టు చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి ఆర్ జె రత్నాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. బాబా శత జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ట్రస్టు సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఐ ఎస్ ఎన్ ప్రసాద్, వందిత శర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ముచ్చటిస్తున్న సిఎం చంద్రబాబు

విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

కళాశాల ఏర్పాటుకు స్థలం దానం చేసిన దాత కూతురును సన్మానిస్తున్న సిఎం

'ఉపాధి' బిల్లులు చెల్లించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

బుక్కరాయసముద్రం : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలనిఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పుల్లయ్య, కార్యదర్శి నాగలింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒ సొలమన్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 8 వారాల బిల్లులు చెల్లించాలని, వారంవారం బిల్లులు చెల్లించాలని, 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని, పనులు చేసే చోట వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పులనురూపాయలు కూలి ఇవ్వాలని 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా 200 రోజులు పనులు కల్పించాలని, పనులు చేసే చోట వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వహీదా బేగం, లక్ష్మి, భాగ్యమ్మ, అరుణ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' అప్పులకు జమ

బ్యాంకర్ల నిర్వాకంతో బాధితులు లబోదిబో - చర్యలు తీసుకోవాలని వ్యకాసం డిమాండ్

ప్రజాశక్తి-శింగనమల

బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

తల్లికి వందనం పథకానికి సంబంధించిన డబ్బులను బ్యాంకు అధికారులు పాత అప్పునకు జమ చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు మండలంలోని సలకంచెరువు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వద్ద లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే...

సలకం చెరువు మాదిగ కాలనీకి చెందిన బండెల రాములమ్మకు కుమారుడు, కొడుకు ఉండటంతో తల్లికి వంతనం పథకం కింద రూ.26వేలు గ్రామంలోని ఎస్‌బిఐ రాములమ్మ ఖాతాలో జమ అయింది. ఈమెతోపాటు ఇదే గ్రామానికి చెందిన హరిజన లతకు ఓ కూతురు ఉంది. దీంతో ఆమెకు కూడా తల్లికి వందనం కింద రూ.13వేలు ఇదే బ్యాంకు ఖాతాలో జమ అయింది. అయితే ఆయా కుటుంబాలకు మహిళా సంఘాల్లో అప్పు ఉండటంతో తల్లికి వందనం నగదును సంబంధిత బ్యాంకు అధికారులు జమ చేసుకున్నారు. దీంతో బాధితులు బ్యాంకు వెళ్లి తమ తల్లికి వందనం నగదు ఇవ్వాలని అడగడంతో బ్యాంకు అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తూ బయటికి పొమ్మని హుకుం జారీ చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన మొత్తాన్ని బ్యాంకుల్లోని అప్పులకు జమ చేసుకోకూడదు. అయితే సలకం చెరువు బ్యాంకు అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పేదలకు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ బాధితులతో కలిసి బ్యాంకు సిబ్బందితో ఆరాతీశారు. అయినా కూడా బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సలకంచెరువు ఎస్‌బిఐ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ ఖాతాదారుల పట్ల నిర్యక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ పథకాల సొమ్మును అప్పులకు జమ చేసుకుని పేదల కడుపు కొట్టడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి వచ్చిన తల్లికి వందనం డబ్బులను బాధితులకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుంకన్న, కుళ్లాయప్ప, రామకృష్ణ, వెంకటశలిమి, నాగయ్య, లాల్ మునయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

సమస్యల పరిష్కారానికి ఒంటికాలిపై నిరసన

సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కారం చేయాలని గురువారం నగరపాలక సంస్థ ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, ఇంజనీరింగ్ కార్మికుల నగర గౌరవాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పాలకులు మారుతున్నా ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు తీరడం లేదని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వీరి వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన చెందారు. జీవో నెంబర్, 36 అదే రకంగా 16, 15 జీవోలు కూడా కార్మికులకు వేతనాలు పెంచాలని తెలియజేస్తున్న ప్రభుత్వం దాని ప్రకారం వేతనాలు ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి పని చేసి 60 సంవత్సరాలు వచ్చిన తర్వాత, రిటైర్మెంట్ పేరుతో ఇంటికి పంపుతున్నారే తప్ప ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలేదన్నారు. గత 17 రోజుల సమ్మె కాలంలో రిటైర్మెంట్ బెనిఫిట్, 75 వేల రూపాయలు, సర్వీసును బట్టి పెంచుతామని చెప్పి కూడా అమలు చేయలేదన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు ఓబులపతి,మురళి, కోశాధికారి పోతులయ్య, సుబ్బిరెడ్డి, రవికిరణ్, గౌస్, లోకనాథ్, శివన్న, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖారులోపు 'మాతృవందనం' అమలు

ఐసిడిఎస్ పీడీ నాగమణి

మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ నాగమణి

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెలాఖరులోపు కొత్తగా ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం అమలు చేస్తామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ ఇదివరకు ఈ పథకాన్ని వైద్యారోగ్య శాఖ వారు అమలు చేసేవారన్నారు. అయితే ఇక నుంచి ఐసిడిఎస్ ద్వారా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే పథకం అమలుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. పథకం కింద గర్భిణి ఒకరి మీద ఆధార పడకుండా నగదు అందజేస్తారన్నారు. ప్రస్తుతం పోషన్ అభియాన్ కింద పౌష్టికాహారం అందజేస్తున్నట్లు వివరించారు. ఎప్పటికప్పుడు అంగన్వాడీలను తనిఖీ చేసి సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సకాలంలో రోడ్ల మరమ్మతులు : ఇఇ నీవన్‌కుమార్

అనంతపురం : పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో గుంతలు పడిన రోడ్లకు సకాలంలో మరమ్మతుల పూర్తికి చర్యలు తీసుకుంటామని పంచాయతీ రాజ్ పిఐయూ డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సి.నవీన్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ వర్షాలు, ఇతరత్రా కారణాలతో గుంతలు పడినవాటిని బాగు చేయనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పిఐయు డివిజన్ పరిధిలో రూ.23.91 కోట్లతో 88 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. నాణ్యతతో త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

ఆత్మీయ సమావేశానికి సచివాలయ ఉద్యోగులు గైర్హాజరు

ప్రజాశక్తి-కుందుర్పి

మండల పరిధిలోని నిజవల్లి గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశానికి సచివాలయ ఉద్యోగులు గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు నిజవల్లిలోని రెండు పాఠశాలలకు విధులకు హాజరుకావాలి. అయితే ప్రభుత్వ ఆదేశాలను సచివాలయ ఉద్యోగులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది ఎలాంటి అనుమతులు లేకుండా సమావేశానికి గైర్హాజరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది ప్రభుత్వ ఆదేశాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్. వెంకటంపల్లి పాఠశాల

విద్యార్థుల అభ్యున్నతిలో గురువుల పాత్ర కీలకం

ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థి దశ నుంచి జీవితంలో స్థిర పడే వరకూ ప్రతి విద్యార్థి అభ్యున్నతిలో గురువుల పాత్ర చాలా కీలకమని ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక జెఎన్‌టియుఎ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థలో గురుపూర్ణిమ (వ్యాస పూర్ణిమ)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాల్యం నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ, తదనంతర జీవితంలో ఉపాధ్యాయుల బోధనలు సంపూర్ణంగా ప్రభావితం చేస్తాయన్నారు. తద్వారా ఉపాధ్యాయులు ఒక సౌభాగ్యవంతమైన సమాజం, దేశాన్ని నిర్మించడంలో ఎనలేని పాత్రను నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాసంలో మంచి క్రమశిక్షణ ను అలవరచుకుని విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ ఉన్నత స్థితికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి

వైసిపి కార్యకర్తలపై దాడులు మానుకోవాలి

నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

టిడిపి నాయకులు వైసిపి కార్యకర్తలపై దాడులు చేయడం మానుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్తలపై టిడిపి నాయకులు మారణాయుధాలతో దాడి చేయడం దుర్మార్గమన్నారు. హింసకు గురైన వారు అందరూ పేదలే అన్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. చెన్నంపల్లి వంటి సమస్యాత్మక గ్రామంపై పదేపదే అధికార యంత్రాంగానికి చెప్పినా పట్టించుకోలేదని విమర్శించారు. టిడిపి నాయకులు అధికారాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవాలేగానీ, హింస, ఫ్యాక్షన్‌కు ప్రోత్సాహం ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు.దాడి చేసిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘం సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 2024-25లో సదరు సంఘం ద్వారా మహిళా సాధించిన ఆర్థిక పురోభివృద్ధి భవిష్యత్తులో చేపట్టాల్సిన సంఘం అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా విశాలఫెర్రర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే కుటుంబాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఇందుకోసం మహిళా కోఆపరేటీవ్ బ్యాంకును స్థాపించామన్నారు. ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్ మాట్లాడుతూ ఒకప్పుడు మహిళా సంఘాల సమావేశాల నిర్వహణకు ఇబ్బందిగా వుండేదన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, ఆర్డీసీ సిబ్బంది, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

యాడికి : తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల పరిధిలోని పిన్నేపల్లె గ్రామస్తులు గురువారం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. చేసేదిలేక రోడ్డెకాల్సి వస్తుందని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎఎస్ఐ వెంకటేశులు ఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. అనంతరం రెండు రోజుల్లో నూతన పైప్‌లైన్ ద్వారా గండికోట నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలికంగా టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఇఒఆర్‌డి శశికళ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవా, మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జై కిసాన్ కృషి సహకార్ పోస్టర్లు ఆవిష్కరణ

పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి

ఉరవకొండ : జైకిసాన్ కృషి సహకార పోస్టర్లను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఈనెల 15వతేదీన ఉరవకొండలోని యాదవ కళ్యాణ మండంలో నిర్వహించనున్న జై కిసాన్ కృషి సహకార్ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు తెలిపారు. మునిపెన్నడూ లేనివిధంగా రైతు కుటుంబాల ఆరోగ్య పరిరక్షణ కోసం అనంతపురం కిమ్స్ సవీరా ఆసుపత్రి సహకారంలో ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పంటలు, పశుసంరక్షణపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

పామిడి : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ హాస్టల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి నేడు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, రమణ, భాస్కర్‌రెడ్డి, గోపీ, మణికంత, చంటి, బాబు, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్

CHANGE OF NAME

Gowni Ananda (old Name) son of Gowni Hanumantha Reddy R/o 9-5-635/55, JRS Colony, Rayadurg 515865, Ananthapur District of Andhra Pradesh. I changed my New name **Gowini Anandareddy.** Henceforth, I will be known as **Gowini Ananda Reddy**.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి ఉరవకొండ

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్,జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. గురువారం ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పిటిఎం) లో మంత్రి, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తొలుత జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యా వికాసం కోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,పాఠశాలల యాజమాన్య కమిటీలు,ప్రజాప్రతినిధులు అధికారులు,పూర్వపు విద్యార్థులు,దాతలు స్థానికులు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 2 లక్షల 70 వేల మంది దాకా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నారని, రాష్ట్రంలో మన జిల్లా ఈ విషయంలో రెండవ స్థానంలో ఉందని తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ విద్య వల్లనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇప్పటినుండే కష్టపడి ఇష్టపడి చదవాలని చదువుతో పాటు మానవతా విలువలను కూడా పెంపొందించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థుల బంగారు బాటకు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జీవితంలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కష్టాలను అధిగమించినప్పడే సత్ఫలితాలు సాధించవచ్చునని మంత్రి విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మంత్రి తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేసి ఈ స్థాయికి ఎదిగానని అన్నారు.అనంతరం మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా మొక్కలను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా కలెక్టర్ మొక్కలను నాటారు. విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ పథకాలపై అవగాహన నాటిక ప్రదర్శన, డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలపై సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మంత్రి పయ్యావుల కేశవ్

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు 12వ తేదీన అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును రాయదుర్గం మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్స్‌ను ఇంజినీరింగ్ కార్మికులకు కూడా ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, డిఎ, టిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి నుండి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. సమ్మె వల్ల ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు పాలకులు, అధికారులు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య విభాగం నాయకులు రాము, ఇంజినీరింగ్ కార్మికులు నరసింహులు, మైలారి, సురేష్, శ్రీనివాసులు, నాగరాజు, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు, యూనియన్ నాయకులు

మంచి ప్రభుత్వానికి ప్రజాశీర్వాదం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఇంటి నుంచి ప్రజా ఆశీర్వాదం లభిస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదిగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వానికి ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభిస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, నాయకులు ఆకుల అరుణ, ఆకుల ఆంజనేయులు, ప్రతాప్‌చౌదరి, జిసి బాబు, ఎర్రనాగప్ప, తిప్పన్న, సాలేహా, చంద్రబాబు, ఇఒఆర్‌డి శైలజారాణి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శేషారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ జనార్ధన్, సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఆర్ఐ శైలజ, వీఆర్వో శివరామ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

లక్ష్యాలను పూర్తి చేయండి

ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ కేశవరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి సూచించారు. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిగిసారిగా గురువారం స్థానిక బ్యాంకులో బ్రాంచుల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానంగా ఐదు అంశాలపై ప్రత్యేక దృష్టి కనపరిచి 2025-26లో తమకు నిర్దేశించిన లక్ష్యాలు తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తర్వాత డిపాజిట్ల సేకరణ, రుణ వితరణ, వసూళ్లు, లీగల్ కవరేజ్, నిరర్థక ఆస్తుల తగ్గింపు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు. బ్యాంకు బ్రాంచులకు సొంత భవనాలు ఉన్నచోట వాటిని ఆధునీకరణ చేసి వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలను అందిస్తామన్నారు. బ్యాంకు అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో బ్యాంకు సిఇఒ కె.సురేఖరాణి, ఆప్కాబ్ నోడల్ అధికారి సురేంద్ర, బ్యాంకు డీజీఎంలు రామ్‌ప్రసాద్, సుఖదేవ్‌బాబు, విజయ్ చంద్రారెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ కేశవరెడ్డి

కళాశాలలు, యూనివర్శిటీల్లో ఎన్నికలు నిర్వహించాలి

అనంతపురం : ప్రజాస్వామ్యం పరిరక్షణతోపాటు విద్యార్థి దశ నుంచే మంచి నాయకులు తయారు కావాలంటే తప్పనిసరిగా కళాశాలలు, యూనవర్శిటీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రపదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థి సంఘాల ఎన్నికలను నిషేధించారన్నారు. ప్రజలకు మేలు జరగాలన్నా.. విలువలతో కూడిన నాయకులు కావాలన్నా.. రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కళాశాలల్లో తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

'మధ్యవర్తిత్వం'పై అవగాహన

రాయదుర్గం : కోర్టు కేసుల సత్వర పరిష్కారం కోసం మధ్యవర్తిత్వంపై గురువారం నుండి వారం రోజులపాటు అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టర్ రాయల్ మృతికి ఎమ్మెల్యే నివాళి

డాక్టర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సురేంద్ర

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు రాయల్ (79) మృతికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నివాళులర్పించారు. రాయల్ గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే హనుమంతురాయచౌదరి, వైసిపి సమన్వయకర్త రంగయ్య, ఉమామహేశ్వరనాయుడు, తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేత్రదానం

కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ డాక్టర్ రాయలు నేత్రదానానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. ఈమేరకు రెడ్ క్రాస్ కు ఐ డొనేట్ వారు వచ్చి రాయలు నేత్రాలను స్వీకరించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

యాడికి : మండలంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో మంచి మార్కులతో పాసైన విద్యార్థులకు రాయలచెరువు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామానికి చెందిన అమిలినేని వెంకటనాయుడు జ్ఞాపకర్థం ఆయన భార్య లక్ష్మీదేవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామనాథ్, ట్రెజరర్ అల్లాబకష్, సత్యనారాయణ, కులశేఖర్, సూర్యనారాయణ, జయరామిరెడ్డి, ఇస్మాయిల్, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

కెవి మహీధర్ దంపతులకు సన్మానం

అనంతపురం : నగరంలోని 2వ రోడ్డులో ఉన్న మహతి సంగీత పాఠశాలలో గురు పౌర్ణమి సందర్భంగా సభ్యులందరూ తమ గురువు కెవి మహీధర్ దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిష్య బృందం విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ ఎంపి శ్రీనివాసులు, టీచర్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ సుధాకర్ బాబు, లంకా ప్రసాద్, నాగరాజు, శివరంగయ్య, శ్రీనివాస్, అంజనేయులు, ఆదినారాయణరెడ్డి, రమారెడ్డి, ఝాన్సీ, ఇందిర, గాయత్రి, వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

పామిడి : లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు తెలిపారు. అధ్యక్షుడిగా రఘువీర్, ప్రధాన కార్యదర్శిగా పత్రా శ్రీనివాసులు, కోశాధికారిగా షేక్షావలి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ విరుపాక్షిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచంలో 200 పైగా దేశాలో పని చేస్తున్న అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అన్నారు. ప్రతి మనిషి తోటి వారికి సాయం అందించాలన్నదే క్లబ్ లక్ష్యమన్నారు.

రాయదుర్గంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

కళ్యాణదుర్గంలోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేందబ్రాబు

నార్పలలోని పాఠశాలలో విద్యార్థినులతో కలిసి సహఫంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

'ఫ్రెండ్లీ పోలీస్'

ఒకే కంచంలో సిఐ, ఎస్ఐ భోజనం

నార్పల : ఫ్రెండ్లీ పోలీస్‌కు నిదర్శనం సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ అంటూ పలువురు ప్రశంసించారు. గురువారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో సిఐ, ఎస్ఐ ఒకే కంచంలో భోజనం చేయడం చూసి పలువురు హర్షం వ్యక్తం చేశారు. సిఐ కౌలుట్లయ్య సిబ్బందితో స్నేహపూరితంగా మెలుగుతూ అందరి మన్ననలు పొందుతుండటం విశేషం.

ఒకే కంచంలో భోజనం చేస్తున్న సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్

కోలాహలంగా ఉట్లతేరు

ఉట్లతేరులో పాల్గొన్న భక్తులు

పామిడి : పట్టణంలోని భావసార క్షత్రియ సమాజ్ రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో గురువారం ఉట్లతేరు నిర్వహించారు. ఇందులో భాగంగా రంగు రంగుల పూలమాలలతో నయనంద కరంగా తేరును అలంకరించి పాండురంగస్వామి రుక్మిణీ దేవిని రథంలో ఉంచి ఆషాడ మాస బ్రహ్మోత్సవం చేశారు. కర్ణాటక రాష్ట్రం కొప్పల్ నుంచి విచ్చేసిన దిండి భజన మండలి పామిడి బృందం భజనలు చేసింది. అనంతరం ఉట్లమానుకు ఉట్టి కుండ కొట్టారు. అనంతరం గ్రామోత్సవం 3గంటల వరకు సాగింది.

గర్భిణులకు వైద్యపరీక్షలు

యాడికి : పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని రాయలచెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇకె దేవరాజన్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 41 మందికి పరీక్షలు నిర్వమించి నలుగురిని ఉచిత స్కానింగ్ కోసం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణీ కనీసం మూడుసార్లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, జె.షబ్బీర్, ఎస్.సాహిదాబేగం, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్ : శెట్టూరు మండలం యాటకల్లు గ్రామంలో గత మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన హోటల్ నిర్వాహకురాలిని వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త తలారి రంగయ్య గురువారం పరామర్శించారు. యాటకల్లులో మఠం రత్నమ్మ హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి 2 గంటల సమయంలో హోటల్లో గ్యాస్ సిలిండర్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి పూర్తిగా దగ్ధమైంది. విషయ తెలుసుకున్న రంగయ్యతోపాటు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బి.తిప్పేస్వామి, ముఖ్య నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య

నేరాలు ఘోరాలు

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

బొమ్మనహాల్ : మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన బోయ మూక రామన్నకు చెందిన గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామన్న గొర్రె పిల్లలను గూటిలో వేసి గొర్రెలను మేపునకు తీసుకెళ్లారు. దీంతో గ్రామంలోని కుక్కలు గూటి కింద ఉన్న కుక్కలపై దాడి చేసి 8 పిల్లలను చంపి తిన్నాయి. గొర్రెలను తోలుకుని వచ్చిన కాపరి పిల్లలు చనిపోవడాన్ని గమణించి లబోదిబోమన్నారు. దీంతో సుమారు రూ.7వేల వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు.

చెక్‌డ్యాం ధ్వంసంపై ఫిర్యాదు

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో చెక్‌డ్యాం ధ్వంసం చేయడంపై రైతు గోపాల్‌రెడ్డి గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డికి చెందిన పొలం వద్ద జాజికొండ వాగుపై ప్రభుత్వ నిధులతో చెక్‌డ్యాం నిర్మించారు. అయితే గ్రామానికి చెందిన రామచంద్రుడు, కుమారుడు రామకృష్ణ కలిసి చెక్‌డ్యాను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చైన్ స్నాచింగ్‌పై విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకటేవులు

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న చైన్ స్నాచింగ్‌పై అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు గురువారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా పప్పూరులో పర్యటించి బాధిత మహిళను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసును అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

ఘనంగా గురుపూజోత్సవం

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.హర్షలత మాట్లాడుతూ అజ్ఞాన అంధకారాన్ని తొలగించి విజ్ఞానం అనే వెలుగును ప్రసాదించే వాడే గురువు అన్నారు. కావున ప్రతి విద్యార్థి గురువులు, వారి అనుభవాలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు తమ గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, తెలుగు శాఖ అధ్యక్షులు ఎంటి జ్యోత్స్న, అకాడమిక్ కోఆర్డినేటర్ సూర్యనాగిరెడ్డి, డాక్టర్ శైలిజారాణి, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ శ్రీధర్, కవిత, మోనిక, సుధాకర్, షౌకత్‌అలీ, గురు మోహన్, లక్ష్మీనారాయణ, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలో గురు పూర్ణిమ సందర్భంగా లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువులైన తెలుగు పండితులు చింత నారాయణ స్వామి,చెన్న శ్రీనివాసులు , వడ్డే పెద్దన్న లకు గురువారం బిజెపి నాయకుల,ఆర్ఎస్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులు గౌరవించడం మన సంప్రదాయమని ఏ విద్య అయిన విద్య నేర్పించే గురువులు గురువు సంప్రదాయాన్ని గౌరవించే రోజు గురు పూర్ణిమ అంటారు, సాంప్రదాయాలు భావితరాల వారు మరచిపోకుండా జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు . ఈ కార్యక్రమంల విశ్వహిందూ పరిషత్ నాయకుడు తిరుపురం లక్ష్మయ్య, యాడికి బిజెపి మండల అధ్యక్షుడు వద్ది రాజశేఖర్, మురళీకష్ణ ఆలయ భజన బందం పాల్గొన్నారు.

పుట్లూరు : నాగిరెడ్డి పల్లె వద్ద ఉన్న సాయిబాబా దేవాలయం వద్ద మరియు సూర్య పల్లెలో ఉన్న సాయిబాబా దేవాలయం వద్ద గురు పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

అనంతపురం : సమాజంలో గురువు పాత్ర అద్వితీయమని ప్రిన్సిపల్ పద్మశ్రీ అన్నారు. ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గహంలో గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమానికి కళాశాల ఎంతో కషి చేస్తోందన్నారు. అనంతరం సరస్వతి మాతకు పూలమాల సమర్పించారు. వేసవి సెలవుల అనంతరం కళాశాల హాస్టల్ ను పున ప్రారంభించారు. కళాశాల హాస్టల్ లో మంచి వసతి, నాణ్యమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాలనాధికారి రమణ, డిప్యూటీ వార్డెన్లు చలపతి, దేవేంద్ర, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : గురుపౌర్ణమి సందర్భంగా అనంతపురంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన సతీమణి శ్రీలక్ష్మితో కలిసి మారుతీనగర్ లోని షిరిడీ బాబా ఆలయానికి వెళ్లారు. అలాగే 3వ రోడ్డు, వేమన టెలిఫోన్ భవన్ వద్ద బాబా ఆలయాల్లో కూడా పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేకంగా అర్చనలు, పూజా కార్యక్రమాలు చేశారు. బాబా దర్శనం అనంతరం పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ శ్రీ శిరిడీ సాయి నాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. బాబా కపా కటాక్షాలతో నగరాభివద్ధి జరగాలని కోరుకున్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి దంపతులు

ప్రభుత్వ విద్య పరిరక్షణకు చర్యలు

మెగా పేరెంట్స్ సమావేశాల్లో వక్తలు

ప్రజాశక్తి-రాయదుర్గం

తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదువుకోవడానికి వీలు కల్పించాలని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ మాట్లాడుతూ ఈ సమావేశం గొప్ప కార్యక్రమం అన్నారు. తమ పిల్లల చదువు విద్యా ప్రమాణాలు, నడవడికను తెలుసుకునేందుకు తల్లిదండ్రులకు చక్కటి అవకాశం అన్నారు. అంతేగాకుండా ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటేందుకు గ్రీన్ పాస్‌పోర్ట్‌ను ఇస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల అవసరాలు తెలుసుకుని భవిష్యత్తు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. త్వరలో చేపట్టనున్న డీఎస్సీ పోస్టుల భర్తీలో పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ టీచర్ పోస్టును భర్తీ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి నాగమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి నాగేశ్వర్, అటవీ రేంజ్ అధికారి దామోదర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, పాఠశాల కమిటీ అధ్యక్షులు నాగమణి, టిడిపి నాయకులు శంకర్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : రాజకీయాలకు కతీతంగా విద్యార్థులకు విద్య అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో రాజకీయాలు ఉండకూడదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక విద్యకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, కళాశాల కమిటీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ ప్రిన్సిపాల్ బాలప్ప, నాయకులు ఆకుల అరుణ, ఆకుల ఆంజనేయులు, కుళ్లాయప్ప, ప్రతాప్‌చౌదరి, జిసి బాబు, సాలేహ, చంద్రబాబు, మారుతి, నరసింహం, రామానాయుడు, ప్రసాద్‌నాయుడు, కార్యదర్శి బాబా సలాం, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక కేసీజీహెచ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పిల్లలు ఎంత మంది చదువుతున్నా అందరికీ తల్లికి వందనం ఇచ్చామన్నారు. దీనికితోడు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కేసీజీహెచ్ హెచ్ఎం గంధం శ్రీనివాసులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మధ్య మంచి సమాచారం, సంబంధాలు ఉండాలనే ప్రభుత్వం మెగా పీటీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గురువారం నగరంలోని కెఎస్ఆర్ జూనియర్ కళాశాల, శ్రీకృష్ణదేవరాయల మున్సిపల్ హైస్కూల్, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాదికి ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు మరింత మెరుగ్గా రాణించాలని సూచించారు. అనంతరం కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహఫంక్తి భోజనం చేశారు. కెఎస్ఆర్ కళాశాలలో విద్యార్థినుల చేత తల్లుల పాదాలకు పుష్పాలు సమర్పించి పాదాభివందనం చేయించారు. శ్రీ కష్ణదేవరాయ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ ను సొంత ఖర్చులతో నిర్మిస్తామని హామీతో పాటు జూనియర్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ హాస్టల్ కావాలని కోరగా కచ్చితంగా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కాంపౌండ్ వాల్ లేదని చెప్పగా.. ఇందుకోసం నిధులు తెస్తామని చెప్పారు. ప్రతి పాఠశాలలో సైనింగ్ స్టార్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కమిషనర్ బాలస్వామి, నాయకులు కోనంకి గంగారామ్, పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, సరిపూటి రమణ, గుర్రం నాగభూషణం, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్‌యాదవ్, ఫిరోజ్ అహ్మద్, మోహన్ కుమార్, సాకే జయప్ప, కదిరప్ప, నెట్టెం బాలకృష్ణ, వడ్డే భవాని, రమాదేవి, కృష్ణం రఘు, చెరుకుతోట పవన్ కుమార్, ముస్తాక్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మరింత మెరుగైన ఫలితాల సాధన కోసమే మెగా పేరెంట్ టీచర్ మీట్ 2.0 కార్యక్రమం నిర్వహించినట్లు ప్రముఖ విద్యావేత్త, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు, కక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకటస్వామి అన్నారు. గురువారం కక్కలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఎయిడెడ్, ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు జి.కృష్ణయ్య, జి.బయప్ప, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు టి.అనిలా, ఎంపిటిసి ఓబులేసు, డీలర్ శివానంద, గ్రామపెద్ద బి.నరసింహులు, పూర్వ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలం వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఒ శకుంతల, తహశీల్దార్ బాలాజీరాజు, ఎంఇఒలు రవికుమార్, ఓబులపతి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిల్లో మెగా పేరెంట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఇఒ మల్లికార్జున, తహశీల్దార్ మునివేలు, ఎంపిడిఒ విజయభాస్కర్, ఇఒఆర్‌డి దాస్, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల వ్యాప్తంగా మెగా పేరెంట్స్ పెరెంట్స్ సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు పిల్లలు చదువుతున్న తీరుపై తల్లిదండ్రలుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కుళ్లాయప్ప, వైద్యాధికారిణి శ్రావణి, సూపర్‌వైజర్ అరుణమ్మ, ఎఎన్ఎం లీలావతి, వైద్యాధికారిని శ్రావణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : స్థానిక ఎస్ఎల్‌వి ప్రయివేట్ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులతో మొక్కలు నాటించారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శివప్రసాద్, పాఠశాల కమిటీ ఛైర్మన్ నాగవేణి సర్పంచు గోపాల్‌రెడ్డి, ఎంపిటిసి చిన్న జయన్న, అట్టే రామాంజనేయులు, ఏకల ఆదినారాయణ, అట్టే శంకర, జానుగొండ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శివశంకరయ్య, కృష్ణ, నాగరాజు, బైపురెడ్డి, రాజేష్, పరిమళాదేవి, రజినీకుమారి, హేమలత, గంగాభవాని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకటస్వామి

బుక్కరాయసముద్రం : విద్యార్థులో నైపుణ్యం, సృజనాత్మకత పెంచడానికే ప్రభుత్వం మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించిందని ఎంపిపి దాసరి సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే తల్లికి వందనంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుందర, స్కూల్ కమిటీ ఛైర్మన్ బండి లింగమయ్య, టిడిపి మండల కన్వీనర్ అశోక్ లక్ష్మీనారాయణ, రవీందర్, కేసన్న, బుల్లే నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని పాలవెంకటాపురం, బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బ్రహ్మసముద్రం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదాభివందనం చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, జడ్పిటిసి ప్రభావతమ్మ, ఎంఇఒ ఓబుళపతి, కృష్ణానాయక్ శ్రీనివాసులు, యశోదమ్మ, కమిటీ ఛైర్మన్ అల్లాబకాష్, నాయకులు పరమేష్, గంగన్న, అంకే ఓబులేష్, మల్లి, జనార్దన్, అమరా రామ్మోహన్ చౌదరి, వడ్డే నారాయణ, శివయాదవ్, అమరేష్, నవీన్, లింగారెడ్డి, లోకేష్‌రెడ్డి, శివన్న, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఈ టెక్నో చైతన్య పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ వేడుకల్లో సిఇఒ సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సాహం ఎంతో కీలకమన్నారు. అలాగే పట్టణంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా 2.0 పేరెంట్స్ మీటింగ్ ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, పత్రా శ్రీనివాసులు, షఫీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాడికి : మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థలో తల్లిదండ్రులకు చిన్నారులతో పాదాభివందనాలు చేయించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, విజన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బెలుగుప్ప : మండలవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ మారెన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు మ్యూజికల్ ఛైర్స్ ఆట నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తర్వాత మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఇఒ హరికృష్ణ, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శింగనమల మండలం సోదనపల్లిలో నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థి